# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in | ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం | తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 157 క్రిష్ణా, మంగళవారం 03- 03 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## చలివేంద్రం ప్రారంభోత్సవ ఆహ్వానం

క్రైం కౌంటర్ దినపత్రిక సీఈఓ అండ్ ఎడిటర్ ప్రముఖ పారిశ్రామికవేత్త కె.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి చలివేంద్ర కార్యక్రమం నేడు శ్రీకారం చుట్టారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పల్నాడు జిల్లా ఎం.ఈ.ఎఫ్ అధ్యక్షులు చే చలివేంద్రం ప్రారంభించడం జరుగుతుంది.
ఈ కార్యక్రమానికి ఎం.ఈ.ఎఫ్ పల్నాడు జిల్లా నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ప్రేమతో ఆహ్వానిస్తున్నాము.

ఇట్లు
కె.వి. ప్రసాద్
క్రైం కౌంటర్ సీఈఓ & ఎడిటర్ ప్రముఖ పారిశ్రామిక వేత్త
సత్తెన పల్లి, ఆంధ్ర ప్రదేశ్

## రైతులకు ఊరట.. విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, మార్చి 02: కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఏపీలో రైతులకు ఊరట లభించింది. పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించిన ఆదేశాలు సోమవారం జారీ చేసింది. ఈ నెలాఖరులోగా అనుమతులు జారీ చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. మొత్తం పెండింగ్ దరఖాస్తులు: 46,113 ఉండగా.. వీటికి రూ. 250 కోట్ల మేర ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం 22.30 లక్షలు ఉన్నాయి. కొత్తగా ఇప్పటికే 1.12 లక్షల కనెక్షన్లు మంజూరు చేసింది. పెండింగ్‌లో ఉన్నవి క్లియర్ చేయడానికి మరో 10,000 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించనుంది. ఈ పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని డిస్కంలను విద్యుత్ శాఖ మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సాగు సీజన్‌కు ముందే వేలాది మంది రైతులకు విద్యుత్



సౌకర్యం లభించే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.


## ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు
మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు
మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో
అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.
ఇతర వివరముల కొరకు
క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్

Ph.No: 98497 07349


## ప్రజల మనసు గెలవడమే లక్ష్యం..

### పబ్లిక్ పర్సెప్షన్‌పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం




**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు తన పాలనలో 'రియల్–టైమ్ గ్రాస్ సెటిల్మెంట్' 'పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్' ప్రజాభిప్రయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్షెప్సన్‌పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్షెప్సన్ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలి. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి' అని అన్నారు.

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొస్తాం: మంత్రి కొండపల్లి

**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, మార్చి 02: ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి, ఏపీఎన్నార్టీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అందుకోసం చర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు.సోమవారం అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారికి ఏపీఎన్నార్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు వినియోగించుకోవాలంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి సూచించారు.



# ఏపీ జెఏసి జనరల్ సెక్రటరీగా సయ్యద్ ఖాసీం..



ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,మార్చి 2(క్రైం కౌంటర్ డెస్క్):ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) ఎన్టీఆర్ జిల్లా శాఖ సమావేశం గాంధీ నగర్ లోని ఏపీ ఎన్జీవో భవన్లో జరిగింది.ఈ సమావేశంలో ఏపీ జెఏసి ఎన్టీఆర్ జిల్లా శాఖ సెక్రెటరీ జనరల్ గా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారిని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం మండల శాఖ సభ్యులు జిల్లా పరిషత్ పాఠశాల కోటికలపూడి ప్రధానోపాధ్యాయులుపీవీ మాలిని సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ జెఏసి ఇచ్చిన ఈ బాధ్యతలను సమర్ధవంతంగా పనిచేసి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఏపీ జేఏసీ ఇచ్చే కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తామని రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలను నూతన పి ఆర్ సి ని మధ్యంతర భృతి నీ సాధించడానికి ఏపీ జేఏసీ ద్వారా కృషి చేస్తామని తెలిపారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకులు ఉంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని వారిచ్చే ఉద్యమ కార్యాచరణలకు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు హాజరై ఆ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మన పైన ఉందని తద్వారా సమస్యలను సాధించుకోగలమని తెలియజేశారు.ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షులు వి నరేంద్ర మాట్లాడుతూ సెక్రెటరీ జనరల్ గా నియమించబడిన మన సంఘ ప్రధాన కార్యదర్శి కాసింకి అన్ని విషయాల్లో ఏ పి టి ఎఫ్ మండల శాఖ తోడ్పాటుగా ఉంటుందని తెలియజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ పివి దుర్గాప్రసాద్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాసరావు మాట్లాడారు,అనంతరం ఉపాధ్యాయులు మరియు మండల శాఖ నాయకులు వారిని ఘనంగా సత్కరించారు.

# పులికాట్ సరస్సులో పాత సరిహద్దుల కొనసాగింపు

క్రైం కౌంటర్ న్యూస్ : తడ/తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2 : మూడు దశాబ్దాల క్రితంనాటి సరిహద్దులనే తాత్కలిక సరిహద్దులుగా భావించి ఇరు రాష్ట్రాల మత్స్యకారులు శాంతియుతంగా వేట సాగించేలా తిరుపతి,తిరువళ్లూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, ప్రతాప్ చర్యలు తీసుకున్నారు.సోమవారం కలెక్టర్ల నడుమ వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సమావేశానికి ఎస్పీలు సుబ్బరాయుడు,వివేకానందశుక్లా, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.కొద్ది నెలల క్రితం తమిళనాడుకు చెందిన మత్స్యకారులు పాత సరిహద్దులను కాదని సుమారు 3 కిలోమీటర్ల మేర ఆంధ్రా పరిధిలోని సరస్సులోకి చొచ్చుకొని వచ్చి అక్కడ కొత్తగా తాటిమొద్దులను నాటి ఆంధ్రా మత్స్యకారులు ఆ తాటి మొద్దులను దాటి రావద్దంటూ ఘర్షణకు తెరలేపారు. దీంతో మన మత్స్యకారులు కలెక్టర్‌ను ఆశ్రయించిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో జరిగిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఇరురాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలపై స్పష్టత లేకపోవడం వల్ల మత్స్యకారుల మధ్య అపోహలు తలెత్తి ఘర్షణలు చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు వచ్చే శుక్రవారం గుమ్మిడిపూడి తహసీల్దారు కార్యాలయంలో ఇరు జిల్లాల డీఎస్పీ, ఆర్డీవోల స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి ఉన్న సరిహద్దులు ప్రస్తుతం అలాగే




కొనసాగుతాయని తేల్చిచెప్పారు.ఇరుపక్షాల అంగీకారంతో జీపీఎస్ ద్వారా సరిహద్దులను డిజిటల్‌గా నమోదు చేసి భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూస్తామన్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో దేవేంద్రరెడ్డి, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, సూళ్లూరుపేట డీఎ?ఫవో హారిక, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం సమన్వయకమిటీ సమావేశం అనంతరం అధికారులు, మత్స్యకార నాయకులు కలిసి ప్రస్తుతం ఉన్న సరిహద్దులను ప్రత్యక్షంగా పరిశీలిస్తారని బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్ తెలిపారు.

# ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు తీర్పు అహేతుకం

**సీబీఐ అధికారిపై చర్యలకు ఆదేశించడం దిగ్భ్రాంతికరం**

**కుట్ర కోణాన్ని ట్రయల్ కోర్టు విస్మరించింది: సీబీఐ**

**తీర్పుపై హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ**

**974 పేజీలతో రివిజన్ పిటిషన్.. 9న విచారణ**




క్రైం కౌంటర్ న్యూస్ :న్యూఢిల్లీ, మార్చి 2 ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ.. ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. 974 పేజీలతో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టు తీర్పు అత్యంత విస్తుగొలిపేలా ఉందని, అది చట్టపరమైన తప్పిదాలతో కూడుకున్నదని పిటిషన్‌లో సీబీఐ పేర్కొంది. "చట్టవిరుద్ధం, అహేతుకం, ప్రాథమికంగానే లోపభూయిష్టం" అంటూ తీవ్రంగా స్పందించింది. 2021-2022 ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అప్పటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సహా 23 మందిని నిందితులుగా చేర్చారు. సుదీర్ఘకాలం వీరిని తిహాడ్ జైలులో ఉంచారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక తీర్పునిచ్చింది. అందరూ నిర్దోషులేనని తీర్పునిస్తూ జడ్జి జితేంద్రసింగ్.. సీబీఐ తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. దర్యాప్తు సంస్థ ఏ దశలోనూ తన విధిని సరిగా నిర్వర్తించలేదని, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తన తీర్పులో పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుపై సీబీఐ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తీర్పునిచ్చే సమయంలో అసలు కుట్ర కోణాన్ని ట్రయల్ కోర్టు విస్మరించిందని పేర్కొంది. "ప్రాసిక్యూషన్ సమర్పించిన బలమైన సాక్ష్యాధారాలను ట్రయల్ కోర్టు పక్కనబెట్టింది. ప్రధానంగా.. కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రను అంచనా వేయడంలో కోర్టు పొరబడింది. మద్యం సిండికేట్ల కోసం పాలసీని ఎలా మార్చారో వివరించే సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే, తీర్పునిచ్చే సందర్భంలో జడ్జి చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు సంస్థ నిబద్ధతపై ప్రభావం చూపే ప్రమాదముంది" అని సీబీఐ పేర్కొంది.

విడి విడి అంశాలుగా చూసినందునే..

నిందితులు నిర్దోషులంటూ తీర్పు వెలువరించే సమయంలో ట్రయల్ కోర్టు జడ్జి చేసిన మౌఖిక వ్యాఖ్యలను కూడా సీబీఐ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. 4నెలలుగా తాను కేవలం ఈ కేసు ఫైళ్లను చదవడానికే వెచ్చించానని జడ్జి పేర్కొన్నారని, దీనిని బట్టి ఆయన సాక్ష్యాధారాలను అత్యంత లోతుగా విశ్లేషించినట్లు అర్థమవుతోందని తెలిపింది. అయితే, కేసులో అభియోగాలు ఖరారు చేసే ప్రాథమిక దశలో సాక్ష్యాధారాలను అంత సుదీర్ఘంగా, లోతుగా విశ్లేషించడానికి చట్టరీత్యా అనుమతి లేదని గుర్తుచేసింది. కేజ్రీవాల్, సిసోడియా, కవిత పాత్రను విశ్లేషించడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని పేర్కొంది. మద్యం పాలసీ వెనుక ఉన్న భారీ కుట్రను మొత్తంగా చూడకుండా, విడి విడి అంశాలుగా పరిగణించడం వల్ల కేసు నీరుగారిందని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే, దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సీబీఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది దర్యాప్తు సంస్థ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని, ఆ ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరింది. సీబీఐ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ఈ నెల 9న జస్టిస్ స్వరణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

# బీఆర్ నాయుడు మహిళా వ్యసనపరుడన్న భూమన

క్రైం కౌంటర్ న్యూస్ , మార్చి 02టీటీడీ ప్రస్తుత ఛైర్మన్ బీఆర్ నాయుడు లక్ష్యంగా మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శల దాడిని ఉద్ధృతం చేశారు. తిరుపతిలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన మాట్లాడుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ నాయుడు నువ్వు నా కాలి గోటికి కూడా సరిపోవు, నిన్ను కనీసం మనిషిలా కూడా చూడను అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా బీఆర్ నాయుడు ఒక మహిళతో సన్నిహితంగా ఉన్నట్లు చెబుతున్న కొన్ని వీడియోలు, ఫొటోలను భూమన మీడియా ముందు ప్రదర్శించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.తమపై వస్తున్న ఆరోపణలను బీఆర్ నాయుడు 'డీప్ ఫేక్' అని కొట్టిపారేయడాన్ని భూమన తీవ్రంగా తప్పుబట్టారు. అవి డీప్ ఫేక్ వీడియోలు కావని, తాము అన్ని కోణాల్లో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాతే ఈ విషయాన్ని బయటపెడుతున్నామని స్పష్టం చేశారు. 2019లోనే సదరు మహిళ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిందని బీఆర్ నాయుడు మహిళా వ్యసనపరుడని ఆ లేఖలో పేర్కొన్నదని భూమన తెలిపారు. అప్పట్లో ఆ లేఖ చూసి ఆయన కన్నీళ్లు పెట్టుకుంటే నమ్మానని, కానీ ఇప్పుడు వీడియోలు ప్రత్యక్షం కావడంతో అసలు రంగు బయటపడిందని ఆరోపించారు.పవిత్రమైన టీటీడీ ఛైర్మన్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ రాజీనామా చేయకుంటే భవిష్యత్తులో మరిన్ని వాస్తవాలను ఆధారాలతో సహా బయటపెడతామని భూమన హెచ్చరించారు.

# టీడీపీతోనే రాయలసీమ అభివృద్ధి



క్రైం కౌంటర్ న్యూస్ : మదనపల్లె, మార్చి 2: రాయలసీమ అభివృద్ధి టీడీపీ వల్లనే సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. మదనపల్లెలో సోమవారం జరిగిన టీడీపీ రాజంపేట పార్లమెంటు కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు సీఎం దృష్టిలో ఉన్నాయని, వీటిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని ప్రకటించారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. స్థానిక సంస్థల్లో కష్టపడి పనిచేస్తే, 2029 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు మనదే అవుతుందని సూచించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంలో కీలకపాత్ర పోషిస్తానని ప్రకటించారు. పీలేరు ఎమ్మెల్యే ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని, కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్.శ్రీనివాసులురెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, పుంగనూరు, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జులు చల్లా రామచంద్రారెడ్డి, ముక్కా రూపానందరెడ్డి, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్ ప్రసంగించారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్‌తోపాటు కమిటీ సభ్యుల చేత చమర్తి జగన్మోహన్‌రాజు ప్రమాణస్వీకారం చేయించారు.

# యుద్ధ మంటలు

**స్టాక్ మార్కెట్‌లు కుదేల్**

**బంగారం, చమురు ధరల పరుగు**

**పలు విమానాలు రద్దు**

**అయిన వారి కోసం బంధువుల ఆందోళన**

**స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు**



మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రారంభం కావడంతో అందోళన వాతావరణం నెలకొంది. ఈ ప్రభావం సోమవారం మార్కెట్‌పై పడింది. స్టాక్ మార్కెట్‌లు కుదేలయ్యాయి. బంగారం, వెండి పరుగులు తీశాయి. అంతర్జాతీయంగా చమురు రవాణా నిలిచిపోవడంతో మళ్లీ ధరలు పెరుగుతాయన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వారు అక్కడ ఎలా ఉన్నారో ఆందోళనలో కుటుంబ సభ్యులు ఉన్నారు.

కుప్పకూలిన మార్కెట్‌లు... యుద్ధ వాతావరణంతో ఊహించిన విధంగానే సోమ వారం స్టాక్ మార్కెట్ లు కుదేలయ్యాయి. జిల్లా మదుపుదా రులు భారీగా నష్టపోయారు. కొందరు భయ ంతో ఉన్న స్టాక్‌ను అమ్ముకుని నష్టాలను మూటగ ట్టుకున్నారు. అన్ని స్టాక్‌లు రెడ్‌మార్క్‌లోనే ఉండటంతో పెట్టిన పెట్టుబడుల్లో పది శాతానికి పైగా అవిరయ్యాయి. జిల్లాలోని మదుపుదారుల సంపద నష్టం భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. పసిడి, వెండి పరుగు యుద్ధ ప్రభావం పసిడి, వెండిపై భారీగానే చూపి ంది. తగ్గిన ధరలు మళ్లీ ఊపందుకు న్నాయి. సోమవారం గ్రాము ఆర్నమెంట్ బంగారం రూ.15810కి చేరింది. శనివారం ధరతో పొలిస్తే గ్రాము కు రూ.500 పెరిగింది. 24 క్యారెట్ల బంగా రానికి వస్తే శనివారం 16,500 ఉండగా... ఆ ధర సోమవారం నాటికి రూ.17265కు చేరింది. అంటే గ్రాముకు సుమారు రూ. 700 పెరిగింది. వెండి శనివారం కిలో రూ.2.86 లక్షలు ఉండగా... సోమవారం మార్కెట్‌లో రూ.3 నుంచి రూ.3.05 లక్షల వరకు పెరిగింది. రాత్రి అమెరికా మార్కె ట్‌లు ప్రారంభమైన తరువాత ఈ ధరలు ఏ మేరకు పెరుగుతాయన్నది సస్పెన్స్‌గా మారింది. యుద్ధ వాతావరణం కొనసాగే వరకు వీటి ధరలు తగ్గుముఖం పట్టే ఛాన్స్ లేదంటున్నారు.

రద్దయిన విమానాలు ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధంతో గల్ఫ్ దేశాలు గగనతలాన్ని మూసివేశారు. దీంతో అంతర్జాతీయ విమానాలు చాలా రద్దయ్యాయి. టిక్కెట్‌లు బుక్ చేసుకున్న వారంతా ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. గల్ఫ్ నుంచి జిల్లాకు వద్దామని సిద్ధమైన వారంతా యుద్ధంతో అక్కడే ఉండిపోయారు. ఇటు శెలవులకు వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు సిద్ధమైనా విమానాలు లేకపోవడంతో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఇలా ఉమ్మడి పశ్చిమలో ప్రయాణాలు రద్దు అయిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అత్యధికంగా గల్ఫ్ వెళ్లే వారు ఉన్నారు. ఆక్కడి నుంచి సెలవులకు వచ్చిన వారు విమానాలు లేకపోవడంతో ఎయిర్ పోర్టుల్లోనే ఆగిపోయారు. వీరి కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతు న్నారు. ఎప్పటికికప్పుడు ఫోన్‌లు చేసి వివరాలు సేకరిస్తున్నారు

# రేషన్.. పరేషాన్ !

**డీలర్లకు పెరిగిన నిర్వహణ భారం**
**పెరిగిన కూలి ఖర్చులు, షాపు అద్దెలు.. పెరగని ఆదాయం**
**నెలలో 20 రోజులు పనిచేసినా అదే కమీషన్**
**వృద్ధుల ఇళ్లకు సరఫరాలో అదనపు భారం**
**ఏలూరులో 1,123, పశ్చిమలో 1,052 మంది డీలర్లు**
**కమీషన్ పెంచాలి.. గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్**



క్రైం కౌంటర్ న్యూస్ : తాడేపల్లిగూడెం, మార్చి 2: రేషన్ డీలర్లు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే చాలాచోట్ల వారు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం కష్టం తప్ప, లాభం లేకపోవడమే. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కమీషన్ పెరుగుతుందనే ఆశించారు. కానీ ఆ పరిస్థితి కనిపించలేదు. దీంతో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నారు. గత ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను పక్కన పెట్టి ఎండీయూలను తెరపైకి తెచ్చింది. ఎండీయూలకు కొమ్ము కాస్తూ వారిపై ఎలాంటి కేసులు లేకుండా కాపాడుకుంటూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ డీలర్ల వ్యవస్థను తెచ్చింది. తమకు కమీషన్ పెంచుతారని ఆశగా చూసిన వారికి చేదు అనుభవమే మిగిలింది. కమీషన్ పెంచకపోగా పనిభారం పెంచారు. ఇప్పుడు 15 రోజులపాటు డిపోలో సరుకులు ఇవ్వాలి. ఐదు రోజులపాటు 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటికి తీసుకెళ్లి బియ్యం, సరుకులు ఇవ్వాలి. మొత్తం నెలలో 20 రోజులపాటు సేవ చేస్తే తమకు శ్రమ తప్ప ఏమీ లేదని వాపోతున్నారు. ఇప్పుడు అదనంగా ఒక కూలీని పెట్టుకుంటే కాని నిర్వహణ సాధ్యం కావడం లేదు. డీలర్లకు అదనపు ఆదాయం సమకూరేలా ఎక్కువ సరుకులు ఇస్తామని చెప్పినా ఆ దిశగా చర్యలు తీసు కోలేదు. ఇప్పుడు చౌక డిపోల్లో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో డీలర్లు చాలీచాలని కమీషన్‌తో కుటుంబాలను నెట్టుకుని రావడం భారంగా మారడంతో షాపులకు రాజీనామాలు చేసే పరిస్థితి వచ్చింది.

ఖర్చులు కూడా రావడం లేదు

రాష్ట్రవ్యాప్తంగా 29,794 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో 1123, పశ్చిమ గోదావరిలో 1052 మంది డీలర్లు ఉన్నారు. వీరంతా రేషన్ షాపులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహణ ఖర్చులు పెరిగాయి. మారుమూల గ్రామాల్లో షాపు అద్దె నెలకు రూ.1500, కరెంట్ రూ.300, మండల కేంద్రాల్లో షాపు అద్దె రూ.3,000 నుంచి 4,000 మధ్య ఉంది. పట్టణాల్లో రూ.4 వేల నుంచి 6 వేల మధ్య ఉంది. పనిచేసే వారికి నెలకు రూ.4 వేల నుంచి 6 వేలు లేకపోతే రావడం లేదు.

డిమాండ్లు పట్టించుకునే వారేరీ ?

ఎంతో కాలంగా డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గౌరవ వేతనం నెలకు రూ.7,500 ఇవాలని, పట్టణ ప్రాంతంలో రూ.15 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. కమీషన్ పెంచాలని కోరుతు న్నారు. ఇదే విష యాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.

కేంద్రం వాటా కమీషన్‌లో జాప్య పేదలకు అందించే బియ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తుంటాయి. వీటికి వేరువేరుగా కమీషన్ ఇస్తుంటారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పేదలకందించే బియ్యానికి ప్రతి నెలా ఎస్‌సీఎంలోకి జమ చేస్తోంది. కాని కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌బీసీ (ఆహార భద్రతా పథకం) ద్వారా అందజేసే బియ్యం వాటా కమీషన్ మాత్రం నెలవారీ డీలర్స్ వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్స్‌కు జమ అవడం లేదు. ఇటీవలే మూడు నెలలకు ఒకసారి పడింది. దీంతో బయట నుంచి డబ్బులు తెచ్చి డీడీలు తీయాల్సి వస్తోంది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్, ఎండీఎం కమీషన్ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విడుదల చేశారు. దీంతో డీలర్లు కొంత ఊపిరి పీల్చుకున్నారు. పారదర్శకత పేరిట సీసీ కెమెరాలు పాదర్శకత పేరిట షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అది పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. అది ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా ? డీలర్లు ఏర్పాటు చేసుకోవాలా ? అనే దానిపై స్పష్టత రాలేదు. ఒక వైర్‌లెస్ సీసీ కెమెరా ఏర్పాటు చేయాలంటే రూ.8 వేలు అవుతుంది. అదే విత్ వైర్ సీసీ కెమెరా ఏర్పాటు చేయాలంటే రూ.13 వేలు పైమాటే. దీనికి నెలనెలా మెయింట్‌నెన్స్ భారం అదనం.

## ఆపన్నహస్తం సీఎం సహాయ నిధి

డోన్ టౌన్, మార్చి 2 ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆపన్నహస్తమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.35,97,311ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. 16 నెలల్లోనే నియోజకవర్గానికి 543 మంది లబ్దిదారులకు రూ.5,11,99,337ల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశామన్నారు. ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు, సంక్షేమ కారణాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు టీఈ రాఘవేంద్రగౌడు, చంద్రపల్లె లక్ష్మినారాయణ యాదవ్, సీమ సుధాకర్ రెడ్డి, శేషఫణిగౌడు, బేతంచెర్ల పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఎల్ల నాగయ్య, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, సంధు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

# ఇష్టపడి.. కష్టపడి చదివితేనే గొప్ప లక్ష్యాలు సాకారం

క్రైం కౌంటర్ న్యూస్ : తిరుపతి రూరల్, మార్చి 2 నేనూ తెలుగుమీడియంలో చదివి వెటర్నరీ విద్యలోకి(1985బ్యాచ్)ప్రవేశించిన ఆర్డినరీ విద్యార్థినే. తొలిరోజుల్లో కొన్ని ఇంగ్లీషు పదాలు అంతగా అర్థమయ్యేవికావు.. సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సరైన ప్రణాళికను ఆచరిస్తే గొప్ప విజయాలు మనముంగిట తలవాల్చుతాయని, దీనికి విద్యార్థిగా ఉన్నప్పుడే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు సరైన ప్రణాళికలు ఆచరించాలని ఎస్వీవెటర్నరీ సైన్స్ కళాశాల పూర్వవిద్యార్థి, ప్రస్తుత వైఎస్సార్ కడపజిల్లా కలెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్ పేర్కొన్నారు. కళాశాల ఆడిటోరియంలో 62వ వార్షికోత్సవాన్ని ఆరోహన్–2కే26పేరిట సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇష్టపడి, కష్టపడి చదివితే ఎంచుకున్న రంగంలో సునాయాసంగా విజయం సొంతం చేసుకోవచ్చని, విద్యార్థిగా ఓపక్క ఎంజాయ్ చేస్తూనే.. మరోపక్క లక్ష్య సాధనదిశగా ప్రణాళికలు ఆచరించాలని సూచించారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ మాట్లాడుతూ.. కళాశాలలో చదివిన ఎందరో పూర్వవిద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, డీఎ?సఏ డాక్టర్ వి.వైకుంఠరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడుతూ.. మూగజీవాలకు సేవచేసే అవకాశాన్ని




అదృష్టంగా భావించాలని, పశువైద్య విద్యలో కళాశాలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి వనరులను వినియోగించుకుని లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ విభాగాల హెడ్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ మార్గంలో తగ్గనున్న దూరం..మక్కాజిపల్లి - ధర్మవరం డబ్లింగ్ పనులు పూర్తి




క్రైం కౌంటర్ న్యూస్ , మార్చి 02 అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ప్రజలకు శుభవార్త. మక్కాజిపల్లి -- ధర్మవరం సెక్షన్‌లో డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ సెక్షన్‌లో 30.04 కి.మీ మేరకు డబ్లింగ్ పనులు పూర్తి అయినట్లు రైల్వే మంత్రిత్వశాఖ వెల్లడించింది. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఈ వివరాలతో పాటుగా ఫోటోలను పోస్ట్ చేసింది. ఈ డబ్లింగ్ పనులు పూర్తి కావటంతో పెనుకొండ - ధర్మవరం మధ్య 42 కిలోమీటర్ల మేరకు డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించింది. ఫలితంగా పెనుకొండ ధర్మవరం మధ్యన ప్రయాణ సమయం తగ్గుతుందని తెలిపింది. ఈ ప్రాంతంలోని చేనేత, పట్టు పరిశ్రమ, సూక్ష్మ, చిన్న , మధ్యతరహా పరిశ్రమలకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని రైల్వే మంత్రిత్వశాఖ ట్వీట్ చేసింది. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపింది. పెనుకొండ ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా 30.04 కిలోమీటర్ల మేరకు మక్కాజిపల్లి – ధర్మవరం సెక్షన్ డబ్లింగ్ పనులను సౌత్ వెస్టర్న్ రైల్వే చేపట్టింది. డబ్లింగ్ పనులు పూర్తి అయిన నేపథ్యంలో రైల్వే సేఫ్టీ కమిషనర్ ఇటీవలే తనిఖీ కూడా నిర్వహించారు. గత ఆదివారం ఈ తనిఖీ నిర్వహించారు. ట్రయల్ రన్?లో భాగంగా 121 కిలోమీటర్ల వేగంతో రైలును నడిపి ట్రాక్ సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సమయంలో ఆస్కిలేషన్ మానిటరింగ్ సిస్టమ్ లో ఎలాంటి ఇబ్బందులు కనిపించలేదు. దీంతో తనిఖీ, ట్రయల్ రన్ ఫలితాల ఆధారంగా, ఈ సెక్షన్‌లో గరిష్టంగా 110 కి.మీ. వేగంతో రాకపోకలు సాగించేందుకు రైల్వే సేఫ్టీ కమిషనర్ అనుమతి ఇచ్చారు. మక్కాజిపల్లి – ధర్మవరం సెక్షన్ డబ్లింగ్ పనులు పూర్తి కావటంతో పెనుకొండ– ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా 66 చిన్న వంతెనలు, 15 రోడ్ అండర్ బ్రిడ్జిలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఒక స్టేషన్ నిర్మించారు. మరోవైపు డబ్లింగ్ పనులతో పాటుగా మక్కాజిపల్లి నాగసముద్రం మధ్యన ఇంటర్మీడియట్ బ్లాక్ హట్ సైతం ప్రారంభించారు. డబ్లింగ్ ప్రాజెక్టు పనులు పూర్తికావటంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వాసులకు ప్రయోజనం కలగనుంది. పెనుకొండ , ధర్మవరం మధ్య ప్రయాణ సమయం తగ్గటంతో పాటుగా చేనేత, పట్టుపరిశ్రమ వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు చెప్తున్నారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం

క్రైం కౌంటర్ న్యూస్ , కర్నూలు అగ్రికల్చర్, మార్చి 2 ఇప్పటిదాకా కర్నూలు మార్కెట్ యార్డులో పప్పుశనగ రైతులకు అంతంత ధర మాత్రమే అందింది. కేంద్ర ప్రభుత్వం క్వింటా పప్పుశనగలకు రూ.5850 మద్దతు ధరగా నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో రైతులకు కేవలం రూ.5వేలు మాత్రమే దక్కుతోంది. దీంతో పాటు తరుగు పేరుతో వ్యాపారులు రైతులను నిండా ముంచుతున్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించి మద్దతు ధరకు పప్పు శనగలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్ర సంస్థ నాఫెడ్‌ను కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. దీంతో పప్పుశనగను సాగు చేసిన రైతులు నష్టాల బారి నుంచి గట్టెక్కే అవకాశం దక్కింది. నాఫెడ్ సంస్థ కర్నూలు జిల్లాలో మార్క్‌ఫెడ్ సంస్థను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ సంస్థ ఏర్పాటు చేసి రైతుల నుంచి పప్పుశనగలను కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు సేకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 40వేల మెట్రిక్ టన్నుల శనగలను నాఫెడ్ సంస్థ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లభించింది. రబీలో ఉమ్మడి జిల్లాలో 2,59,920 ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. కర్నూలు జిల్లాలో 1,14,025 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 1,45,895 ఎకరాల్లో శనగ పంటను రైతులు సాగు చేశారు. ఎకరాకు కనిష్ఠంగా 5 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దాకా రైతులకు అందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

జేసీ ఆదేశాలతో మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు..

గ్రామాల్లో వ్యాపారులు రైతుల నుంచి పప్పుశనగ కొనుగోళ్లలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్కువ ధరను చెల్లించడంతో పాటు తరుగు పేరుతో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతుండటంతో రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు పప్పుశనగలను అమ్మకానికి తీసుకువస్తున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన కలెక్టర్ డా. సిరి జిల్లాలోని మార్కెట్ యార్డులో పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు



ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులను ఆదేశించారు. దీంతో ఇటీవల కర్నూలు మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ అధికారులు రాజీవ్, సంతోష్‌లు పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రస్తుతం రైతులు నాఫెడ్ సంస్థ నిర్ణయించిన నిబంధనల మేరకు పప్పుశన గలను తమ కేంద్రానికి తీసుకురావాలని రైతుల కు విజ్ఞప్తి చేశారు. ఆధార్ కార్డుతో పాటు సాగు చేసిన పంట వివరాలను అదే విధంగా బ్యాంకు పుస్తకాలను వెంట తెచ్చుకోవాలని, శాంపుల్స్‌ను పరిశీలించిన తర్వాత తాము తేదీని నిర్ణయించి రైతులకు సమాచారం అందిస్తామని, వెంటనే పప్పుశనగలను వారి నుంచి కొనుగోలు చేసి 15రోజుల్లోపు డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తామని డీసీఎంఎస్ అధికారి రాజు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రైతుల నుంచి వద్ద మాత్రం మద్దతు ధరపై పప్పుశనగలను కొనుగోలు చేస్తాం. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తాం. పైన పేర్కొన్న నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు ఉన్న వాటిని మాత్రమే కొంటాం. రైతు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని డీసీఎంఎస్ అధికారి రాజు తెలిపారు.

# గుంటూరు ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేసిన షేక్ నూరి ఫాతిమా



క్రైం కౌంటర్ న్యూస్ ,గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ నూరి ఫాతిమా గురువారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కతావతే మయూర్ అశోక్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి తూర్పు నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. నియోజకవర్గంలో తీవ్ర రూపం దాల్చిన వీధి కుక్కల బెడదపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే మురుగు కాలువల (సైడ్ డ్రైన్లు) పూడికతీత పనులు నిలిచిపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్య లోపాలు, చెత్త సక్రమంగా తొలగించకపోవడం, వెలగని వీధి దీపాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# సినిమా




## సొంతూరిలో విజయ్ దేవరకొండ ఇళ్లు చూశారా.

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ సొంతూరులో ఉన్న ఇళ్లు చూసాక సోషల్ మీడియా అంతా వైరల్ అవుతుంది ఆ వీడియో..! ఉదయ్‌పూర్ వేదికగా అంగరంగ వైభవంగా పెళ్లి పీటలెక్కిన టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. భార్యాభర్తలుగా తమ కొత్త ప్రయాణాన్ని అత్యంత స్వచ్ఛంగా ప్రారంభించారు. డెస్టినేషన్ వెడ్డింగ్ తర్వాత ఈ క్రేజీ జోడీ నేరుగా నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని తుమ్మన్ పేట గ్రామానికి చేరుకుంది. పెళ్లయ్యాక రష్మికను తొలిసారిగా తన సొంతూరికి తీసుకొచ్చిన రౌడీ బాయ్.. అక్కడున్న తన ఫామ్ హౌస్‌లో ఈరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. తమ అభిమాన హీరో, కొత్త పెళ్లికూతురిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల జనాలు, ఫ్యాన్స్ భారీ సంఖ్యలో అక్కడికి క్యూ కట్టారు.

పాన్ ఇండియా లెవెల్లో స్టార్‌డమ్ ఎంజాయ్ చేస్తున్నప్పటికీ విజయ్ తన మూలాలను ఎన్నడూ మర్చిపోలేదు. తాను పుట్టి పెరిగిన తుమ్మనపేట అంటే ఆయనకు ప్రాణం. అందుకే జీవితంలో ఎంతో ముఖ్యమైన పెళ్లి తర్వాత జరిగే తొలి పూజా కార్యక్రమాలను హైదరాబాద్ లాంటి మహానగరంలో కాకుండా, తన మట్టిపైనే, తన ఊరి ప్రజల మధ్యే జరుపుకోవాలని ఫిక్స్ అయ్యారు. ఈ వ్రతానికి ఆయన చిన్ననాటి స్నేహితులు, అత్యంత సన్నిహిత కుటుంబ సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ వ్రతానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నెటిజన్లు ముద్దుగా పిలుచుకునే 'విరోష్' జంట ట్రెడిషనల్ లుక్స్‌లో అదరగొడుతున్నారు. తమ పెళ్లి వేడుకల ప్లానింగ్‌ను అభిమానులకు కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేసుకున్న ఈ జంట.. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాన్స్‌కు స్వీట్ బాక్సులు పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు.దేశం నలుమూలల నుంచి అభిమానుల ఆశీస్సులు అందుకున్న ఈ జంట.. ఇప్పుడు సొంత ఊరిలో పెద్దల దీవెనలు తీసుకోవడం అందరి మనసులను గెలుచుకుంటోంది. సత్యనారాయణ స్వామి వ్రతం కోసం తుమ్మన్ పేటలోని విజయ్ ఫామ్ హౌస్‌ను అచ్చమైన పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా సంప్రదాయబద్ధంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమం కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య చాలా ప్రైవేట్‌గా జరిగినప్పటికీ.. బయట మాత్రం వాతావరణం పండుగలా మారిపోయింది. విజయ్, రష్మికలను ఒక్కసారైనా చూడాలని ఫ్యాన్స్ పోటెత్తడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని కంట్రోల్ చేశారు. ముఖ్యంగా ఆయన ఫామ్ హౌజ్ మూడు అంతస్థులతో మామూలుగా లేదు. డ్రోన్ షాట్స్‌లో చూస్తుంటే ఇంద్రభవనం కూడా తక్కువే అనిపిస్తుంది.

కొన్ని ఏకరాలలో ఈ ఫామ్ హౌజ్ ఉంది. చుట్టూ పచ్చటి పంటపొలాల మధ్య అదిరిపోయేలా ఈ ఇంటిని ముస్తాబు చేసారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోనూ విజయ్ దేవరకొండకు అద్భుతమైన ఇళ్లు ఉంది. కానీ సొంతూరులో ఉన్న ఫామ్ హౌజ్ మాత్రం అత్యద్భుతంగా ఉంది. సొంతూరిలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు ముగించుకున్న ఈ జంట.. నెక్స్ట్ ఫోకస్ అంతా హైదరాబాద్‌లో జరగబోయే గ్రాండ్ రిసెప్షన్ పైనే పెట్టారు. మార్చి 4న భాగ్యనగరంలో అట్టహాసంగా జరగనున్న ఈ వేడుకకు టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీల నుంచి అగ్ర హీరోలు, దర్శకులతో పాటు పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా హాజరు కానున్నారు. మొత్తానికి ఉదయ్‌పూర్ వెడ్డింగ్, తుమ్మన్ పేటలో సత్యనారాయణ వ్రతం, ఇప్పుడు హైదరాబాద్‌లో రిసెప్షన్.. ఇలా విజయ్, రష్మికల పెళ్లి సందడి ఎక్కడా తగ్గకుండా ఓ రేంజ్‌లో సాగుతోంది.







## బాడీని ఫిల్టర్ చేసే అద్భుతమైన డ్రింక్..

ప్రస్తుత జీవనశైలి, ఒత్తిడి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి కారణాల వల్ల చాలామంది గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, అజీర్ణం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఛాతీలో మంట, పుల్లటి త్రేనుపులు, గొంతులో అడ్డుపడినట్లు ఉండటం వంటివి ఈ సమస్యల సాధారణ లక్షణాలు. ఆహారం జీర్ణాశయంలోకి చేరినప్పుడు ఉత్పత్తి అయ్యే హైడ్రోక్లోరిక్ యాసిడ్ పైకి ఎగదన్నడం వల్ల ఈ మంట, ఎసిడిటీ సమస్యలు వస్తాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి తరచుగా మందుల వాడకం కంటే, ఆయుర్వేద చిట్కాలను పాటించడం ఉత్తమమని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..మన పూర్వీకులు నమ్మిన ఒక ప్రభావవంతమైన ఆయుర్వేద చిట్కా ధనియాల కషాయం. ఇది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలకు తక్షణ ఉపశమనాన్ని అందించి, అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది.

కషాయం తయారీ విధానం:

ఒక గ్లాసు లేదా అర లీటరు నీటిని తీసుకోండి. అందులో ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, మూడు లేదా నాలుగు నల్ల మిరియాలు, మూడు లేదా నాలుగు లవంగాలు (లవంగాల మధ్యలో ఉండే పువ్వు తీసివేసి), చిటికెడు పసుపు వేయండి. ఈ మిశ్రమాన్ని స్టవ్ మీద పెట్టి, నీరు సగం అయ్యేంత వరకు బాగా మరిగించాలి. నీరు సగం అయ్యే వరకు మరిగించండి. ఆ తర్వాత గోరువెచ్చగా అయ్యాక వడగట్టుకుని తాగండి..

కషాయం ప్రయోజనాలు:

ధనియాలు: ఆయుర్వేదం ప్రకారం ధనియాలకు శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంది. ఇవి గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు చక్కగా పనిచేస్తాయి.

జీలకర్ర: జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

మిరియాలు: అజీర్తి సమస్యలకు చక్కటి ఔషధంలా పనిచేస్తాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించి, గ్యాస్, ఎసిడిటీకి ఉపశమనం కలిగిస్తాయి. హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉత్పత్తికి సహాయపడి, ఆహారం ఎక్కువసేపు జీర్ణాశయంలో నిల్వ ఉండకుండా చేస్తాయి.

లవంగాలు: ఇవి కేవలం సుగంధ ద్రవ్యాలు మాత్రమే కావు, కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, విటమిన్ ఎ వంటి పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని నివారిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి.

పసుపు: ఇందులో ఉండే ఔషధ గుణాలు జీర్ణక్రియకు సహాయపడతాయి.

డైలీ తాగితే.. ఎన్నో సమస్యల నుంచి ఉపశమనం:

ఈ కషాయాన్ని రోజుకు ఒకటి లేదా రెండుసార్లు తీసుకోవడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు:

జీర్ణ సమస్యలు: గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి తక్షణ ఉపశమనం.

గుండె ఆరోగ్యం: రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులు రాకుండా సహాయపడుతుంది.

రోగనిరోధక శక్తి: శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులు రాకుండా చేస్తుంది.

సాధారణ వ్యాధులు: జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం, విరోచనాలు వంటి సమస్యలతో బాధపడేవారికి ఉపశమనం.

అంతర్గత శుద్ధి: జీర్ణాశయంలో ఉండే క్రిములు, ఏలిక పాములు వంటివి చనిపోవడానికి సహాయపడుతుంది.

మధుమేహం నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

శరీర ఉష్ణోగ్రత: ఒంట్లో వేడిని తగ్గిస్తుంది.

థైరాయిడ్ ఆరోగ్యం: థైరాయిడ్ సమస్యలు ఉన్నవారిలో హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది.

ఈ కషాయాన్ని ఎప్పుడైనా, ఎవరైనా తాగవచ్చు. గ్యాస్ లేదా కడుపు ఉబ్బరంగా అనిపించిన వెంటనే తీసుకోవడం వల్ల త్వరగా ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా ఉండాలంటే వారానికి కనీసం రెండు రోజులు ఈ కషాయాన్ని తీసుకోవడం మంచిది. దీంతో పాటు, రోజుకు ఆరు నుంచి ఏడు గ్లాసుల నీళ్లు తాగడం వల్ల కూడా జీర్ణ సమస్యలను నివారించవచ్చు. ఈ చిట్కా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..



## "నువ్వు తోపు భయ్యా"

టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన వేళ, యావత్ క్రికెట్ ప్రపంచం ఒకే ఒక పేరును జపిస్తోంది.. అదే సంజు శాంసన్.. వెస్టిండీస్‌తో జరిగిన అగ్నిపరీక్ష లాంటి మ్యాచ్‌లో సంజు వీరవిహారం చేశాడు. అచ్చం క్వార్టర్ ఫైనల్ తరహాలో సాగిన ఈ పోరులో గెలిస్తేనే సెమీస్ బెర్త్ దక్కుతుందన్న ఉత్కంఠ మధ్య సంజు శాంసన్ అజేయంగా 97 పరుగులు చేసి, భారత్‌ను ఒంటిచేత్తో విజయతీరాలకు చేర్చాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగి, జట్టును సెమీస్ గడప దాటించి కానీ వెనుతిరగలేదు. సంజు చేసిన ఈ విధ్వంసాన్ని చూసి యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ మురిసిపోయాడు. తన ఆరాధ్య ఆటగాడు, అన్న లాంటి సంజు శాంసన్ ఇన్నింగ్స్‌పై సోషల్ మీడియా వేదికగా వైభవ్ చేసిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న సమయంలో సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ మధ్య ఒక మంచి అనుబంధం ఏర్పడింది. వీరిద్దరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండేవారు. తన పెద్దన్న టీమిండియా కోసం ఇంతటి కీలక సమయంలో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడటంతో వైభవ్ ఆనందానికి అవధుల్లేవు. సంజు శాంసన్ ఫోటోను ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేస్తూ.. ఎక్స్‌ట్రా స్పెషల్ భయ్యా అంటూ మనసులోని మాటను బయటపెట్టాడు. ఇది కేవలం ఒక ప్రశంస మాత్రమే కాదు, సంజు అంటే వైభవ్‌కు ఉన్న గౌరవం మరియు ప్రేమాభిమానాలకు నిదర్శనం.

అయితే, సంజు శాంసన్ అంటే కేవలం అభిమానం మాత్రమే కాదు, వైభవ్‌కు సంజుతో ఒక చిన్న డీల్ కూడా ఉంది. గతంలో వైభవ్ సూర్యవంశీ సంజు శాంసన్‌ను ఒక కోరిక కోరాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్?కి ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. రాజస్థాన్ జట్టును వీడి వెళ్తున్న సమయంలో వైభవ్ ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చేస్తూ.. "నువ్వు ఎక్కడికి వెళ్లినా సరే, నాకు మాత్రం నీ బ్యాట్లను ఎప్పుడూ ఇస్తూనే ఉండాలి భయ్యా" అంటూ ఒక గమ్మత్తైన డిమాండ్ పెట్టాడు. సంజు బ్యాట్లతో ఆడితే తనకు బాగా కలిసి వస్తుందనేది వైభవ్ నమ్మకం కాబోలు.

ప్రస్తుతం సంజు శాంసన్ వరల్డ్ కప్ సెమీఫైనల్ మ్యాచుల కోసం సిద్ధమవుతుంటే, వైభవ్ సూర్యవంశీ డీవై పాటిల్ టోర్నమెంట్‌లో బిజీగా ఉన్నాడు. ఐపీఎల్ 2026లో వీరిద్దరూ వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహించబోతున్నారు. వైభవ్ రాజస్థాన్ తరఫున, సంజు చెన్నై తరఫున తలపడనున్నారు. ఆ సమయంలో మైదానంలో ఎదురుపడినప్పుడు తన తమ్ముడి బ్యాట్ కోరికను సంజు శాంసన్ కచ్చితంగా తీరుస్తాడని క్రికెట్ ప్రియులు భావిస్తున్నారు. అంతకంటే ముందుగా, సంజు తన పవర్ ఫుల్ బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి భారత్‌కు వరల్డ్ కప్ అందించాలని వైభవ్ కూడా కోరుకుంటున్నాడు.





## సంజు శాంసన్ తోపు.. కానీ టీమిండియా ఫ్లాపు..

టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా జైత్రయాత్రను చూసి ఓర్వలేక పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లు చేస్తున్న విమర్శలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా పాక్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ అమీర్ నోటికి పని చెప్పారు. గతంలో భారత్ సెమీఫైనల్‌కు కూడా అర్హత సాధించదని జోస్యం చెప్పి అడ్డంగా బుక్కైన అమీర్, ఇప్పుడు టీమిండియా సెమీస్ చేరిన తర్వాత మాట మార్చారు. వెస్టిండీస్‌తో జరిగిన చావోరేవో తేల్చుకోవాల్సిన పోరులో సంజు శాంసన్ 97 పరుగులతో అదరగొట్టి భారత్‌ను విజయతీరాలకు చేర్చగా, ఈ విజయం వెనుక ఉన్న లోపాలను వెతికి పట్టుకుంటూ అమీర్ తన అక్కసును వెళ్లగక్కారు.ఒక క్రీడా కార్యక్రమంలో పాల్గొన్న మహమ్మద్ అమీర్ మాట్లాడుతూ.. భారత్ సెమీస్‌కు చేరినప్పటికీ వారు ఆడుతున్న తీరు అస్సలు బాలేదని విమర్శించారు. ఒక ఇన్నింగ్స్ మొత్తం జట్టు లోపాలను కప్పిపుచ్చలేదని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా టీమిండియా ఫీల్డింగ్‌పై అమీర్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో భారత్ మూడు, నాలుగు సులభమైన క్యాచ్‌లను వదిలేసిందని, అది సెమీస్ లాంటి కీలక మ్యాచ్‌లో కొంపముంచుతుందని హెచ్చరించారు. బౌలింగ్ విభాగంలోనూ జస్ప్రీత్ బుమ్రా మినహా మిగిలిన బౌలర్లందరూ భారీగా పరుగులు ఇస్తున్నారని, భారత్ కేవలం ఒక్క బౌలర్‌పైనే ఆధారపడి ఆడుతోందని ఆయన ఎద్దేవా చేశారు.

అయితే, టీమిండియాను విమర్శిస్తూనే సంజు శాంసన్ ఆడిన ఇన్నింగ్స్‌ను అమీర్ కొనియాడక తప్పలేదు. సంజు శాంసన్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడని ఆయన ప్రశంసించారు. "నేను సంజు శాంసన్ ఐపీఎల్ మ్యాచ్‌లు, ఇతర ఇన్నింగ్స్‌లు చాలా చూశాను. కానీ 196 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, 65 వేల మంది ప్రేక్షకుల మధ్య, తీవ్రమైన ఒత్తిడిలో 50 బంతుల్లో 97 పరుగులు చేయడం సామాన్యమైన విషయం కాదు. అది సంజు శాంసన్ క్లాస్ ఏంటో నిరూపించింది" అని అమీర్ చెప్పుకొచ్చారు. టీమిండియా బ్యాటింగ్ బలహీనతలు సంజు వల్లే బయటపడలేదని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం టీమిండియా తన సెమీఫైనల్ పోరుకు సిద్ధమవుతోంది. మార్చి 5, గురువారం నాడు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. 2022 టీ20 వరల్డ్ కప్‌లో ఇదే ఇంగ్లాండ్ చేతిలో సెమీఫైనల్లో భారత్ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈసారి అదే ఇంగ్లాండ్‌పై ప్రతీకారం తీర్చుకుని ఫైనల్‌కు వెళ్లాలని రోహిత్ సేన పట్టుదలతో ఉంది. అమీర్ వంటి మాజీల విమర్శలకు మైదానంలోనే సమాధానం చెప్పాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు. బుమ్రాకు తోడుగా మిగిలిన బౌలర్లు రాణించి, ఫీల్డింగ్ లోపాలను సరిదిద్దుకుంటే భారత్‌ను అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు.





Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com